సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 26 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.26,320

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26,320, కనిష్టంగా రూ.6,500 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.11

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.11, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.7 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

29.7°/ 16.1°

జిల్లాలో చలి వాతావరణం నెలకొంది. బుధవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'దళవాయి'కి రిపబ్లిక్ డే వేడుకల ఆహ్వానం



దళవాయి చలపతి

ధర్మవరం రూరల్: జాతీయ స్థాయిలో ప్రఖ్యాతిగాంచిన తోలుబొమ్మల కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దళవాయి చలపతికి కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం పంపింది. 2025 జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానిస్తూ బుధవారం సమాచారం పంపింది. తనను గుర్తించి ఆహ్వానం పంపిన కేంద్ర ప్రభుత్వానికి దళవాయి చలపతి కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాలను దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన 'గ్రీన్ టెక్' సంస్థ

పెనుకొండ రూరల్: తమ వాహనాలను కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారని గ్రీన్‌టెక్ సంస్థ మేనేజర్ అశోక్ మంగళవారం కియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందులో పేర్కొన్న వివరాల మేరకు... గ్రీన్‌టెక్ సంస్థ పెనుకొండ మండలం మక్కాజిపల్లి తండా సమీపంలో రెడీమిక్స్ కాంక్రీట్ పరిశ్రమ నిర్వహిస్తోంది. ఇందుకు సంబంధించి సామగ్రి తీసుకెళ్లే వాహనాలను జాతీయ రహదారి-44 నుంచి మక్కాజిపల్లికి వెళ్లే మార్గంలో కొందరు వ్యక్తులు అడ్డుకుంటున్నారు. వాహన డ్రైవర్లపై దౌర్జన్యానికి దిగుతున్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని..తమ వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చూడాలని పోలీసులను మేనేజర్ కోరారు. కాగా..గ్రీన్‌టెక్ ఫిర్యాదుపై కియా పోలీసులు స్పందించలేదు. దీంతో సంస్థ యాజమాన్యం బుధవారం డయల్ 100కు సమాచారం అందించింది. ఉన్నతాధికారులు స్పందించి స్థానిక పోలీసులను ఆదేశించడంతో పట్టణ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో గ్రీన్‌టెక్ పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. ప్రస్తుత పరిణామాలపై మేనేజర్‌తో ఆరా తీశారు.

మహిళలకు కంప్యూటర్ శిక్షణ, ఉపాధి అవకాశాలు

రాప్తాడు: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలోని ఎస్‌ఎల్‌సీ (సెల్ఫ్ లెర్నింగ్ సెంటర్)లో నిరుద్యోగ మహిళలకు 45 రోజుల పాటు వివిధ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఎంటీఎల్ ఇంద్రజ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, బేసిక్ టాలీ, ఎంఎస్ ఆఫీస్, తెలుగు, ఇంగ్లిష్ టైపింగ్, లైఫ్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఏదైనా డిగ్రీ, బీటెక్ పూర్తి చేసి, 20 నుంచి 35 ఏళ్ల వయసున్న మహిళలు అర్హులు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలు రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 73969 50345, 91001 02811 నంబర్లలో సంప్రదించవచ్చు.

శతాధిక వృద్ధురాలి మృతి



హుసేనమ్మ(ఫైల్)

రొద్దం: స్థానిక ప్రాథమిక పాఠశాల విశ్రాంత అటెండర్ హుసేనమ్మ(109) బుధవారం మృతి చెందారు. వయస్సు మీద పడినా తన పని తాను చేసుకుంటూ దృష్టి, వినికిడి లోపం లేకుండా అందరినీ పలకరిస్తూ ఉండే వారని ఆమె కుమారుడు రైల్వే బాబు తెలిపారు. అయితే రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురై ఆమె బుధవారం మృతి చెందినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఆమె 109 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు వివరించారు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు హుసేనమ్మ ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.

అంబరం.. క్రిస్మస్ సంబరం



ప్రశాంతి నిలయంలో జరిగిన కార్యక్రమంలో శాంటాక్లాజ్ వేషధారణలో చిన్నారి



హిందూపురం సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



సోమందేపల్లి చర్చిలో కేక్ కట్ చేసి ఆనందాలు పంచుకుంటున్న సంఘస్తులు



బత్తలపల్లిలో 'చర్చ్ ఆఫ్ క్రీస్ట్'లో గేయాలు ఆలపిస్తున్న క్రైస్తవులు



ఓడీసీ సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ జయానందం



క్రిస్మస్ సందర్భంగా ఎన్పీకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మానవులను రక్షించేందుకు భువిపై లోక రక్షకుడు ఉద్భవించిన క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం జిల్లా వాసులు ఘనంగా జరుపుకున్నారు. హిందూపురం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం, మడకశిర తదితర ప్రాంతాల్లోని చర్చిలలో ఉదయమే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు భారీగా తరలిరావడంతో చర్చిలన్నీ కిటకిటలాడాయి. క్రీస్తు జనన వృత్తాంతం, ఆయన బోధించిన ప్రేమ, కరుణ, త్యాగాన్ని పాస్టర్లు వివరించారు. చర్చిల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీలు, పశువుల పాకలు ఆకట్టుకున్నాయి. పలు చోట్ల సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి చాటారు.

– సాక్షి బృందం, శ్రీసత్యసాయి జిల్లా



కదిరిలోని జోర్డాన్ బ్లెస్సింగ్ చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

కూటమి ప్రభుత్వం 'బెల్టు' తీసింది. పల్లెకు నిషా ఎక్కిస్తోంది. అధికారం అండతో కాసుల కోసం తెలుగు తమ్ముళ్లు గమ్మత్తు దందాకు తెరతీశారు. ఎక్సైజ్ అధికారుల సహకారంతో ఊరూరా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ఒక దుకాణానికి అనుమతులు తీసుకుని అనధికారికంగా రెండు, మూడు నిర్వహిస్తూ నిరుపేదల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు మాత్రం మద్యం అక్రమంగా విక్రయించినా..బెల్టుషాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామంటూ ప్రచార ఆర్భాటం చేస్తుండగా... ఆయన బావమరిది బాలకృష్ణ ప్రాతినిథ్యం వహిస్తున్న హిందూపురంలోనే అక్రమ మద్యం ఏరులై పారుతోంది.



పల్లెల్లో బెల్టు కిక్కు!

- కాసుల కోసం తమ్ముళ్ల గ'మ్మత్తు' దందా
- చిలమత్తూరులో ఒక షాపుకు అనుమతి.. రెండు ప్రాంతాల్లో దుకాణాల నిర్వహణ
- లేపాక్షి మండలంలో 46 బెల్టు షాపులు
- ఎక్సైజ్ శాఖ కనుసన్నల్లో వ్యవహారం
- చిన్నాభిన్నమవుతున్న పేదల జీవితాలు

చిలమత్తూరు/లేపాక్షి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగు తమ్ముళ్లు మద్యాన్నే ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఊరూరా ఏరులై పారిస్తూ జేబులు నింపుకుంటున్నారు. చిలమత్తూరు మండలానికి సంబంధించి ప్రభుత్వం ఒక మద్యం షాపునకు అనుమతి ఇవ్వగా.. అనధికారికంగా మరో షాపును నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అనుమతి ఇవ్వగానే తొలుత కొడికొండ చెక్‌పోస్టులో మద్యం దుకాణం ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించారు. అయితే తాజాగా అదే మద్యం దుకాణాన్ని చిలమత్తూరుకు మార్చుకుంటున్నట్లు అధికారులు తెలిపి చిలమత్తూరులో మద్యం దుకాణం తెరిచారు. ఇప్పుడు అటు చెక్‌పోస్టులోనూ, ఇటు చిలమత్తూరులోనూ అధికారికంగానే మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. హిందూపురం రూరల్ మండలంలోని తూముకుంట, కిరికెర గ్రామాల్లోనూ ఇలానే ఒక దుకాణానికి అనుబంధంగా మరోచోట దుకాణం ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా గ్రామానికో బెల్టుషాపు ఏర్పాటు చేసి పల్లెల్లో మద్యాన్ని పారిస్తున్నారు. ఇప్పటికే కర్ణాటక మద్యానికి అలవాటు పడిన వారికోసం ఆ రాష్ట్ర మద్యాన్ని కూడా బెల్టు షాపుల ద్వారా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



చిలమత్తూరులో నిర్వహిస్తున్న మద్యం దుకాణం



కొడికొండ చెక్‌పోస్టులో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణం

బెల్టుషాపులు షురూ..

కర్ణాటక సరిహద్దులో ఉన్న చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం మండలాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపగా, ఇప్పుడు గ్రామ గ్రామానా బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి. మద్యం అక్రమ రవాణా కూడా జోరుగా సాగుతుండటంతో చిలమత్తూరు చిల'మత్తు'రుగా మారిపోయింది.

ఎక్సైజ్‌శాఖ కనుసన్నల్లోనే అమ్మకాలు..!

ఒక దుకాణానికి అనుమతి పొంది రెండు, మూడు చోట్ల విక్రయాలు సాగించడం, గ్రామానికో బెల్టు షాపు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్న విషయాలు తెలిసినా ఎక్సైజ్ శాఖ అధికారులు తమకేమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ నెల 3న అక్రమాలకు 'హాయి' వే శీర్షికన మద్యం అక్రమ రవాణా, బెల్టు షాపుల నిర్వహణపై సాక్షిలో కథనం ప్రచురితం కాగా, 13న ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య కొడికొండ చెక్‌పోస్టులోని తనిఖీ కేంద్రాన్ని పరిశీలించారు. అప్పటికే రెండు చోట్ల మద్యం షాపులు నిర్వహిస్తున్నారు. ఆ రోజు ఎక్సైజ్ శాఖ స్థానిక అధికారులు వెంటనే కొడికొండ చెక్‌పోస్టులోని మద్యం దుకాణాన్ని బంద్ చేయించారు. ఆ తర్వాత యథావిధిగా అమ్మకాలు జరిపారు.

> **నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**
>
> చిలమత్తూరు మండలంలో మద్యం దుకాణం ఒక్కటే ఉంది. అది కూడా చిలమత్తూరులోనే ఉంది. మరెక్కడా లేదు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటు చేసి ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అలాగే బెల్టుషాపులపై నిఘా ఉంచాం. ఎవరైనా బెల్టుషాపు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> – లక్ష్మీదుర్గయ్య, ఎక్సైజ్ సీఐ, హిందూపురం

గోవాను తలపిస్తున్న లేపాక్షి..



బెల్టుషాపు వద్ద ఫ్రెండ్స్ రెస్టారెంట్ అంటూ బోర్డు ఏర్పాటు చేసిన నిర్వాహకులు

లేపాక్షి మండలంలో ఊరూరా బెల్టు దందా నడుస్తుండటంతో గోవాను తలపిస్తోంది. లాటరీ ద్వారా మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తిపై దాడులు చేసి మరీ దుకాణాన్ని దౌర్జన్యంగా దక్కించుకున్న టీడీపీ నేతలు... ఆ దుకాణానికి అనుబంధంగా ఊరూరా బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అనుమతిచ్చిన మద్యం దుకాణంలోనే క్వార్టర్‌పై రూ. 20 నుంచి 30 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక మండలంలో గ్రామానికో బెల్టు దుకాణం చొప్పున 42 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి గమ్మత్తు దందా జోరుగా నడుపుతున్నారు. ఒక్కో బెల్టుషాపు ఏర్పాటుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేసినట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో అయితే రెండు, మూడు బెల్టు షాపులు కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇక్కడ క్వార్టర్ మద్యంపై రూ.50 నుంచి రూ.70 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు మద్యం మత్తులో జోగుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

- కోడిపల్లి పంచాయతీ పరిధిలోని నాగేపల్లి-కోడిపల్లి మధ్య ఉన్న రహదారి పక్కనే బెల్టు షాపు ఏర్పాటు చేశారు. బార్ అండ్ రెస్టారెంట్‌కు దీటుగా లైటింగ్, డీజే సౌండ్‌లతో బెల్టుషాపును నిర్వహిస్తున్నారు. అలాగే మండలంలోని చాలా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, మెయిన్ రోడ్లకు సమీపంలోనే బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు.



కోడిపల్లి రోడ్డులో బార్‌ను తలపిస్తున్న బెల్టుషాపు



మరువకొత్తపల్లి వద్ద ఓ చెట్టుపై ఉన్న సైబీరియన్ పక్షి



చెట్లపై సేదతీరుతున్న సైబీరియన్ పక్షులు



అతిథులొచ్చాయ్!

- సందడి చేస్తున్న సైబీరియన్ పక్షులు

సైబీరియా అతిథులొచ్చాయి. పుట్టినిల్లు వీరాపురం, వెంకటాపురం గ్రామాల్లో సందడి చేస్తున్నాయి. ఏటా డిసెంబరు, జనవరి మాసాల్లో సైబీరియన్ పక్షులు ఈ గ్రామాలకు వచ్చి పునరుత్పత్తి చేసుకొని ఆరు నెలల అనంతరం తిరిగి తమ దేశానికి వెళ్లిపోతాయి. ఈ క్రమంలోనే తొలివిడతలో ఓ గుంపు ఇటీవలే వీరాపురం చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో ఏ చెరువులో చూసినా ఎర్రకాళ్ల కొంగలు దర్శనమిస్తూ చూపరులను ఆకర్షిస్తున్నాయి.

– చిలమత్తూరు:

'పోరుబాట'ను విజయవంతం చేయండి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపు



'పోరుబాట' కార్యక్రమం పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పరిగి: విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు... ఆరు నెలల్లోనే సర్దుబాటు పేరుతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టిందన్నారు. ఈ నేపథ్యంలోనే విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 27న జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'పోరుబాట' నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం పరిగిలో పర్యటించిన ఆమె పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి 'పోరుబాట' పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అలవిగాని హామీలిచ్చిన కూటమి పార్టీల నేతలు... అధికారంలోకి వచ్చాక ఒక్కటంటే ఒక్కహామీని అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ముఖ్యంగా విద్యుత్ చార్జీల పెంపుతో సాధారణ ప్రజలతో పాటు పారిశ్రామిక వర్గాలపై మోయలేని భారాన్ని మోపారన్నారు. కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీల బాదుడుపై నిరసనగా వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో విద్యుత్ శాఖ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. పార్టీ శ్రేణులతో పాటూ ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రైవర్‌కు మూర్ఛ.. దూసుకెళ్లిన బస్సు


ఆటోను ఢీకొన్న కేఎస్‌ఆర్టీసీ బస్సు

మడకశిర: డ్యూటీలో ఉన్న డ్రైవర్‌కు ఆకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న వాహనాలపై దూసుకెళ్లింది. ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... పావగడ నుంచి బెంగళూరుకు బయలుదేరిన కేఎస్‌ఆర్టీసీ బస్సు (కేఏ57ఎఫ్4409) మడకశిరలోని మారుతీనగర్ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకోగానే డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చాయి. దీంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపిన వాహనాలపైకి దూసుకెళ్లి... ఆగిపోయింది. ప్రమాదంలో నారాయణప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంతో పాటు ఓ ఆటో ధ్వంసమయ్యాయి. డ్రైవర్‌ని, గాయపడిన వ్యక్తిని వెంటనే మడకశిర ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గాండ్లపెంట: మండలంలోని గొడ్డువెలగల పంచాయతీ నీరుకుంట్లపల్లికి చెందిన రైతు శంకర్ (55) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. గ్రామ సమీపంలో తనకున్న పొలంలో వరి సాగు చేపట్టిన శంకర్ బుధవారం ఉదయం నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వెళ్లాడు. విద్యుత్ మోటార్ స్టార్ట్ చేసే క్రమంలో షాక్‌కు గురి కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

కదిరి టౌన్: లారీని ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లకు చెందిన సయ్యద్ బాబ్జాన్ (22), తన స్నేహితుడు అతుల్లాఖాన్‌తో కలసి మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై పులివెందుల మార్గంలో ఉన్న ఓ ధాబాకు డిన్నర్ కోసం బయలుదేరారు. ఈ క్రమంలో తమ ఎదురుగా వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో సయ్యద్ బాబ్జాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అతుల్లాఖాన్‌ను స్థానికులు వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

- సోలార్ ఎనర్జీలో ఆదర్శంగా నిలుస్తోన్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్
- 'గోగ్రీన్' స్ఫూర్తితో సౌర విద్యుత్‌కు పెద్దపీట
- పుట్టపర్తిలో 6.3 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి
- కాలుష్య నియంత్రణతో ప్రజలకు ఆరోగ్యం

సాయి సన్నిధిలో... సౌర వెలుగులు


ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్

పుట్టపర్తి అర్బన్: ఆధ్యాత్మికతను, సేవా భావాన్ని పంచుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న 'సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్' కాలుష్య నియంత్రణలోనూ తనవంతు పాత్ర పోషిస్తోంది. భగవాన్ సత్యసాయిబాబా ఏర్పాటు చేసిన ఈ ట్రస్టు ప్రజలకు ఉచిత వైద్యం, విద్య, తాగునీరు అందించడమే కాకుండా పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగానికి పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా సౌర విద్యుత్‌ను భారీస్థాయిలో ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ సౌర విద్యుత్ అందించాలనే లక్ష్యంతో 'ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన' పేరుతో పథకాన్ని అందుబాటులో తీసుకువచ్చింది. అయితే సత్యసాయి ట్రస్ట్ ఆరేళ్ల క్రితమే సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగంతో ఆదర్శంగా నిలుస్తోంది.

'గోగ్రీన్' స్ఫూర్తితో...

ప్రశాంతి నిలయం వేదికగా 2018లో 'గోగ్రీన్' సదస్సు జరిగింది. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా ఉన్న పర్యావరణ వేత్తలు హాజరయ్యారు. అప్పట్లో వీరు ఇచ్చిన సలహాలు, సూచనలకు అనుగుణంగా ట్రస్ట్ భవనాలపై సౌరవిద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి.. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సొంత అవసరాలకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. వెంటనే కొన్ని భవంతులతో పాటు ఖాళీ స్థలాల్లో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి తొలుత రెండు మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. అనంతరం రెండవ విడతలో 2.5 మెగా వాట్లు, మూడో విడతలో 1.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అనుగుణంగా సోలార్ ప్యానెళ్లు అమర్చారు. మొత్తం ట్రస్టు భవనాలతో పాటు ఆస్పత్రిలోని ఖాళీ స్థలాల్లోనూ సౌర ఫలకాలను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తిలో ట్రస్ట్ నిర్వాహకులు ఆదర్శంగా నిలిచారు.


పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని ప్రతి భవనంపై కనిపిస్తున్న సోలార్ ప్యానెళ్లు

చూడచక్కని ఏర్పాటు..

పుట్టపర్తిలో సత్యసాయి ట్రస్ట్‌కు సంబంధించిన కళాశాల భవనాలు, క్రీడా ప్రాంగణాలు, సాయికుల్వంత్ మందిరం, భజన మందిరం, సౌత్, ఈస్ట్, వెస్ట్, నార్త్ క్యాంటీన్ భవనాలు, సాధనా ట్రస్ట్, సత్యసాయి సూపర్ స్పెషాలిటీ, జనరల్ ఆస్పత్రి భవనాలు, ఇండోర్ స్టేడియం, సంస్థ కార్యాలయ భవనాలు, రెసిడెన్షియల్ క్వార్టర్స్‌పై సోలార్ ప్యానెళ్లను చూడచక్కగా అమర్చారు. ఈ అందమైన ఆకృతులు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. భవనాలపై సోలార్ ఫలకాలు ఏర్పాటు చేయడంతో భవనాల లోపల కొంత మేర వేడి సైతం తగ్గింది.

గ్రిడ్‌కు అనుసంధానం..

సత్యసాయి ట్రస్ట్ ఉత్పత్తి చేస్తున్న సౌర విద్యుత్‌ను స్థానిక అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. దీంతో మిగులు విద్యుత్తుపై యూనిట్‌కు రూ.2.9 చొప్పున విద్యుత్ సంస్థ ట్రస్ట్‌కు చెల్లిస్తోంది. ఈ మొత్తం నేరుగా ట్రస్ట్ బ్యాంకు ఖాతాకు జమ అవుతుండడం గమనార్హం.

కాలుష్యాన్ని నియంత్రించగలిగాం



సౌర ఫలకాల ఏర్పాటుతో చాలా వరకూ వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించగలిగాం. విద్యుత్ బిల్లులు ఆదా అయ్యాయి. ట్రస్ట్ విస్తరించిన ప్రతి ప్రాంతంలోనూ సౌర ఫలకాల ఏర్పాటుకు చొరవ తీసుకుంటున్నాం. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే బొగ్గు, నీళ్ల లభ్యత తగ్గిపోయే ప్రమాదముంది కావున, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్‌జే రత్నాకర్‌రాజు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ

మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతాం



సత్యసాయి సెంట్రల్ ట్రస్టు స్ఫూర్తితో సౌర విద్యుత్ ఉత్పత్తిలో పుట్టపర్తిని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతాం. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేస్తాం. పీఎం సూర్య ఘర్ యోజన పథకంలో భాగంగా సౌర విద్యుత్ ఉత్పత్తికి ఏర్పాటు చేసే పరికరాలు సుమారు 25 ఏళ్ల పాటు మన్నిక వస్తాయి. కావున ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి.

– శివరాం, విద్యుత్ శాఖ డీఈ, పుట్టపర్తి

ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం అగ్రికల్చర్: స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి వివిధ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు వంద శాతం ఉపాధి కల్పన అవకాశాలను కల్పించనున్నారు. ఈ మేరకు కృష్ణా జిల్లా నందిగామలో ఉన్న కీట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి, అర్హత ఉన్న వారికి ఈ నెల 27 నుంచి నందిగామలో శిక్షణ ప్రారంభమవుతుంది. డేటా ఎనాలసీస్‌కు సంబంధించి అన్ని రకాల ఆధునిక కోర్సులపై మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తారు. ఉచిత భోజన, వసతి కల్పిస్తారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు, ఉపాధి అవకాశాలు దక్కేలా చర్యలు తీసుకుంటారు. పూర్తి వివరాలకు హరిప్రసాద్ (90004 87423), శ్రీనివాస్ (98498 88266)ను సంప్రదించవచ్చు.

రైలులో నుంచి కిందపడిన విద్యార్థి

- సత్వరమే స్పందించి కాపాడిన రైల్వే పోలీసులు


డి.చెర్లోపల్లి-చిన్నేకుంటపల్లి గ్రామాల మధ్య రైలు పట్టాల పక్కన పడిన హరిత

బత్తలపల్లి: తిరుపతి నుంచి గుంతకల్లుకు ప్రయాణిస్తున్న రైలు నుంచి ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తు కిందపడింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సత్వరమే స్పందించి ఆమెను కాపాడారు. ఆర్‌పీఎఫ్ సీఐ బోయ కుమార్ తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన బోయ నాగరాజు కుమార్తె బోయ హరిత అన్నమయ్య జిల్లా మదనపల్లి వద్ద ఉన్న కలికిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. క్రిస్మస్ సెలవులు రావడంతో బుధవారం తన సోదరుడు గిరిబాబుతో కలసి స్వగ్రామానికి వెళ్లడానికి గుంతకల్లు ప్యాసింజర్ రైలు ఎక్కారు. వీరు ప్రయాణిస్తున్న రైలు ముదిగుబ్బకు చేరగానే హరిత వాష్ రూంకు వెళ్లింది. ఎంతసేపటికీ ఆమె రాకపోవడంతో అనుమానం వచ్చిన సోదరుడు రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. ఆమె వద్దనున్న ఫోన్ సిగ్నల్ ఆధారంగా బత్తలపల్లి మండలం చిన్నేకుంటపల్లి-డి.చెర్లోపల్లి గ్రామాల మధ్య రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సెక్షన్‌లోని ఆన్ డ్యూటీ కీమెన్ మస్తాన్‌ను అప్రమత్తం చేయడంలో ఆయన అక్కడికు పరిశీలించారు. సమాచారం అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన హరితను 108 అంబులెన్స్‌లో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు కింద పడిపోయినట్లు ప్రాథమిక విచారణ తేలింది. ప్రస్తుతం ప్రాణాపాయం నుంచి ఆమె బయటపడినట్లు ఆర్డీటీ వైద్యులు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హిందూపురం టౌన్: స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ (ఎంజీఎం)లో 1979–80 విద్యా సంవత్సరంలో చదువుకున్న వారందరూ అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. అప్పటి ఉపాధ్యాయులు అక్బర్ షరీఫ్, నారాయణ శెట్టిను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు వేణుగోపాల్, నారాయణ మూర్తి, తిమ్మయ్య, మల్లికార్జున, వై.సి.ప్రభాకర్, ఎస్‌ఎల్‌వీ వేణు తదితరులు నేతృత్వం వహించారు.

ఆటోను ఢీకొన్న మరో ఆటో

- ఏడుగురికి గాయాలు

బత్తలపల్లి: రోడ్డుపై బోల్తాపడిన ఆటోను మరో ఆటో ఢీకొన్న ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం నిడిగల్లులో ఉన్న చర్చి నిర్వాహకులు క్రిస్మస్ పండుగ సందర్భంగా చికెన్ తీసుకువచ్చేందుకు ఆటోలో బుధవారం ఉదయం ధర్మవరానికి బయలుదేరారు. బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకోగానే ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన పల్లంలోకి వెళ్లింది. దీంతో ఆటోను తిరిగి రోడ్డుపైకి ఎక్కించే ప్రయత్నంలో రాయిని ఢీ కొనడంతో బోల్తా పడింది. అదే సమయంలో ముదిగుబ్బ మండలం వలిమిచెర్లోపల్లిలో సమీప బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన కొత్తపల్లి బాలరాజు తన భార్యతో కలసి వెళుతున్న ఆటో ఢీకొంది. రెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదంలో నిడిగల్లు ఆటో డ్రైవర్ సంతోష్, చిన్నగాని తొలంద్ర బాబు, నరేంద్ర, మామిళ్లపల్లి ఆటో డ్రైవర్ బాలరాజు, ఆయన భార్య శ్రావణితో పాటు బత్తలపల్లి వరకూ ఆటోలో ప్రయాణిస్తున్న దుగ్గెన్న (ధర్మవరం పట్టణం బోయవీధి), ఆర్డీటీ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో పని చేస్తున్న యమున (ధర్మవరం మండలం నాగలూరు గ్రామం) గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ప్రైవేట్ అంబులెన్స్ ద్వారా ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం దుగ్గెన్నను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కులం పేరుతో దూషణ

కదిరి టౌన్: పట్టణంలో కూరగాయల వ్యాపారంతో జీవనం సాగిస్తున్న హరిజన కామాక్షిని కులం పేరుతో దూషించిన కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారి గౌస్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వ్యాపారంలో భాగంగా అప్పుగా తీసుకున్న కూరగాయలకు సంబంధించి ఆమె రూ.1,950 చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని ఇవ్వలేదన్న అక్కసుతో గౌస్ ఆమె తోపుడుబండిని లాక్కొన్నాడు. అడ్డుకోబోయిన కామాక్షిని కులం పేరుతో నడిబజారులో దూషించాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మున్సిపల్ పరిధిలోని దేవానంద్ కాలనీకి చెందిన రవిశేఖర్‌ప్రసాద్‌పై బుధవారం సాయంత్రం చంద్ర, మస్తాన్, అస్లాం వారి స్నేహితులు దాడి చేసిన ఘటనపై కూడా కేసు నమోదు చేశారు.

యువకుడి దుర్మరణం

గుత్తి రూరల్: వాటర్ ప్లాంట్‌లోకి లారీ దూసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న గుత్తి మండలం యంగన్నపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ (24), లక్ష్మణ్ బుధవారం తొండపాడు గ్రామంలో వాటర్‌ప్లాంట్ పక్కన నూతన గృహ నిర్మాణ పనుల్లో పాలు పంచుకున్నారు. సాయంత్రం పనులు ముగించుకున్న అనంతరం వాటర్ ప్లాంట్ వద్ద నీళ్లు తాగుతున్న సమయంలో భాస్కర్, లక్ష్మణ్‌ను తాడిపత్రి వైపుగా వెళుతున్న లారీ ఢీకొని ప్లాంట్‌లోకి దూసుకెళ్లింది. భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్‌ను స్థానికులు గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ప్రశాంతి నిలయంలో ఘనంగా క్రిస్మస్

ప్రశాంతి నిలయం: క్రిస్మస్ పర్వదిన వేడుకలు ప్రశాంతి నిలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. దేశవిదేశాలకు చెందిన వేలాది భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. సాయికుల్వంత్ సభా మందిరాన్ని క్రిస్మస్ సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు క్రిస్మస్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులకు క్రిస్మస్ బహుమతులు అందజేశారు. క్రిస్మస్ విశిష్టతను చాటుతూ క్యారల్స్ ఆలపించారు. విదేశీ సత్యసాయి భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన క్రిస్మస్ కేక్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు, సత్యసాయి సేవా సంస్థల గ్లోబల్ కౌన్సిల్ అధ్యక్షుడు చక్రవర్తి కట్ చేసి భక్తులకు పంపిణీ చేశారు.


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు, చక్రవర్తి


క్యారల్స్ ఆలపిస్తున్న ప్రశాంతి భజన బృందం

విద్యుత్ చార్జీల పెంపుపై ఉద్యమం

- ప్రజలపై కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్ల భారం
- వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజక వర్గ సమన్వయకర్త ప్రకాష్‌రెడ్డి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక భారీగా పెంచి నవంబర్‌లో రూ.6 వేల కోట్లు, డిసెంబర్‌లో రూ.9 వేల కోట్ల భారం ప్రజలపై మోపారని వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం అనంతపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ ఈ నెల 27న పిలుపునిచ్చిన పోరుబాటను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యుత్ చార్జీలను పెంచారంటూ ప్రజలను టీడీపీ నేతలు మభ్యపెట్టారన్నారు. వాస్తవంగా ప్రజలపై భారం పడకుండా జగనన్న చర్యలు తీసుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్‌ను వ్యాపారంగా మార్చి కేవలం తన లాభాపేక్ష కోసం యూనిట్ విద్యుత్‌ను రూ.5.90తో బాబు కొనుగోలు చేశారన్నానరు. సీఎంగా వైఎస్ జగన్ ఉన్న సమయంలో సెకీ ద్వారా యూనిట్‌ను రూ.2.49కే కొనుగోలు చేసి రూ.87,500 కోట్ల భారం ప్రజలపై పడకుండా చూశారన్నారు. ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీల మినహాయింపు ద్వారా యూనిట్‌కు మరో రూ.2 రాయితీ ఇవ్వడం ద్వారా రూ.లక్ష కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. దేశానికే ఆదర్శంగా అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జగనన్న చర్యలు తీసుకుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా చంద్రబాబు కుట్ర పూరిత రాజకీయాలు చేశారన్నారు. విద్యుత్‌ను వ్యాపారంగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఈ నెల 27న పోరుబాట చేపట్టి రాప్తాడు నియోజకవర్గంలోని ఏఈ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.

రూ.80 వేల కోట్లు ఏం చేశారు బాబూ?

కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ప్రతి నెలా దాదాపు రూ.13 వేల కోట్ల చొప్పున గడిచిన ఆరు నెలల్లో రూ.80 వేల కోట్ల అప్పు చేశారని, ఆ డబ్బును ఎక్కడ ఖర్చు చేశారో సీఎం చంద్రబాబు చెప్పాలని ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలకు పంగనామాలు పెట్టారన్నారు. జగనన్న అమలు చేసిన 'అమ్మ ఒడి', 'వైఎస్సార్ చేయూత', 'రైతు భరోసా', 'వైఎస్సార్ ఆసరా', చేదోడు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా తదితర పథకాలు ఇప్పుడు లేకుండా పోయాయన్నారు. 'తల్లికి వందనం' పేరుతో దగా చేశారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న 43 లక్షల మంది తల్లులకు రూ.15,000 చొప్పున ఏటా రూ.6,500 కోట్లు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు తాగేందుకు చుక్క, ఆడేందుకు మట్కా, పేక ముక్క, వేసుకునేందుకు గుట్కా ఉండాలన్నదే చంద్రబాబు చిట్కా అని ఎద్దేవా చేశారు. కూటమి సర్కార్ చర్యలను ఎండగట్టే సమయం ఆసన్నమైందని, పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో రామగిరి ఎంపీపీ నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు జూటూరు శేఖర్, అమర్‌నాథ్ రెడ్డి, రామాంజినేయులు, నీరుగంటి నారాయణ రెడ్డి, ఈశ్వరయ్య, నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వీరాంజనేయులు, ఈశ్వరయ్య, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

